క్లుప్తంగా

బాబా మందిరం వద్ద ఆహార ఫ్రిడ్జ్ ఏర్పాటు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీ షిర్డీ సాయిబాబా మందిర ప్రాంగణంలో దాత సహకారంతో ఆహార ఫ్రిడ్జ్ ఏర్పాటు చేశామని మందిర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతమ్‌రెడ్డి అన్నారు. స్థానిక మందిర ప్రాంగణంలో తోట కిరణ్మయి జ్ఞాపకార్థం రాయపూడి అనూరాధ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఆహార ఫ్రిడ్జ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ నిరుపేదల ఆకలి తీర్చేందుకు ఆహార ఫ్రిడ్జ్‌ను ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఇళ్లలో మిగిలిన ఆహార పదార్థాలను ఇక్కడ ఆహార ఫ్రిడ్జ్‌లో ఉంచుతామని అవసరమైన వారు ఫ్రిడ్జ్‌లోని ఆహారాన్ని ఉచితంగా తీసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మందిర కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి, న్యాయవాది పి.మల్లయ్య పాల్గొన్నారు.

త్వరితగతిన రహదారుల పనులు చేపట్టాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): వర్షాలు పడే లోపు దావు బుచ్చయ్యకాలనీలో రోడ్లు వేయాలని దావు బుచ్చయ్యకాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి కనకారావు విజ్ఞప్తి చేశారు. స్థానిక దావు బుచ్చయ్యకాలనీలో ఆదివారం రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దావు బుచ్చయ్యకాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి సాధ్యమైనంత త్వరితగతిన రోడ్లు వేయాలని కోరారు. వర్షాలు పడితే రోడ్లు చిత్తడిగా మారి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఈ అంశాన్ని స్థానిక కార్పొరేటర్ బి.జానారెడ్డి, ఎమ్మెల్యే మల్లాది విష్ణు దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించామని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు అర్జా వెంకటేశ్వరరావు, గుర్రం స్వామి, చిరంజీవి, ఈదుపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా వెంకన్నకు గరుడ సేవ



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి వారు ఆదివారం గరుడ వాహనంపై ఊరేగారు. వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలో కొలువై ఉన్న పురాతన ఆలయం శ్రీ వెంకటేశ్వ స్వామి వారి దేవస్థానంలో పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా కల్యాణోత్సవంలో భాగంగా విష్వక్సేనపూజతో ఉత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం మహాసంకల్పం, ప్రవర, యజ్ఞోపవీతధారణ, కన్యాదానం, మంగళ్యధారణ, తలంబ్రాలు సమర్పణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. వైదిక కార్యక్రమాలను పొన్నంగిపల్లి రామచంద్రమూర్తి, దీక్షితులు నిర్వహించారు.

విశేష హారతులు..

స్వామి వారి సన్నిధిలో వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం స్వామి వారికి గరుడ సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయంలోని స్వామి వారి ఉత్సవమూర్తులను గరుడవాహనంపై అధిష్ఠింపజేశారు. అనంతరం స్వామి వారికి సహస్రనామార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే స్వామి వారి ప్రత్యేక హారతులిచ్చి ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో ముమ్మార్లు ఊరేగించారు. మంగళ వాయిద్యాలు, వేదపఠనం, భక్తుల నామస్మరణల మధ్య స్వామి వారి గరుడ సేవ వైభవంగా కొనసాగింది. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి గెల్లి హరిగోపీనాథ్‌బాబు పర్యవేక్షించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ఆటోనగర్(విజయవాడతూర్పు): కొమ్మారెడ్డి బ్రహ్మనందరెడ్డి(భూమిపుత్ర) ఆధ్వర్యంలో ఆదివారం పటమటలోని గణపతి సచ్చిదానంద ఆశ్రమం రోడ్డులో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఎండను సైతం లెక్కచేయకుండా వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ప్రముఖ వైద్యుల ఆధ్వర్యంలో 150 మందికి పైగా పరీక్షలు చేసి రూ.50 వేల విలువ చేసే మందులను ఉచితంగా పంపిణీ చేశారు. బీపీ, సుగరు, ఈసీజీతో పాటు తదితర పరీక్షలను చేసి రోగులకు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు బ్రహ్మనందరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సేవచేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శం.. మావ్ లైనాంగ్ నగరం

- కొనసాగుతున్న కార్పొరేటర్ల బృందం పర్యటన
- ఆసియాలో అత్యంత పరిశుభ్రమైన నగరం మావ్ లైనాంగ్
- పారిశుద్ధ్య కార్మికులు ఉండని వైనం



మావ్ లైనాంగ్ నగరంలో కార్పొరేటర్ల బృందం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆసియాలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా గుర్తింపు పొందిన మావ్ లైనాంగ్ నగరంలో అమలు చేస్తున్న సంస్కరణలను విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ల బృందం పరిశీలించింది. ఈశాన్య రాష్ట్రాల విజ్ఞాన యాత్రలో భాగంగా నాలుగో రోజైన ఆదివారం వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ నేతృత్వంలోని కార్పొరేటర్ల బృందం మావ్ లైనాంగ్ నగరాన్ని సందర్శించింది. 2003లో ఆసియాలో ఏకైక గ్రామంగా, 2005లో ఇండియాలో పరిశుభ్ర గ్రామంగా గుర్తింపు పొందిందన్నారు. ఈ గ్రామం 2017 ఎన్‌పీఆర్ నివేదిక ప్రకారం టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చెంది 60 శాతం ఆదాయ వనరులు పొందుతుందని కార్పొరేటర్ల బృందం గ్రహించింది. మావ్ లైనాంగ్ ఆదర్శ నగరమని చెప్పారు. నగర విశేషాలు..

బ్యాంబూ బుట్టలు ఏర్పాటు

పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి మనం ఇంటిని ఏ విధంగా శుభ్రంగా ఉంచుకుంటామో అదే మాదిరిగా నగరాన్ని కూడా అలాగే శుభ్రం చేసుకుంటారు. నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దుకోవాలనే లక్ష్యంగా అక్కడ నివసించే ప్రతి ఒక్కరూ రోజూ పరిసరాలను, వీధులను శుభ్రం చేసుకుంటున్నారు. అక్కడ పారిశుద్ధ్య కార్మికులు ఎవరూ ఉండరని గుర్తించింది కార్పొరేటర్ల బృందం. చెత్త వేసుకునేందుకుగాను ప్రతి నివాసం, వీధులలో బ్యాంబూ బుట్టలను ఏర్పాటు చేసుకుని చెత్తను వాటిల్లో వేస్తారు. దీంతో సేంద్రీయ ఎరువును తయారు చేసుకుని వినియోగించుకుంటున్నారు.

90 శాతం అక్షరాస్యత..

నగరంలో పచ్చదనాన్ని పెంపొందించటంతో పాటు ప్లాస్టిక్ వాడకాన్ని, పొగ తాగటాన్ని నిషేధించారు. ప్రధానంగా అక్కడ ఇంకుడు గుంతల వ్యవస్థను ప్రోత్సహించి అమలు చేస్తున్నారు. నగరంలో 90 శాతం అక్షరాస్యత కలిగి ఒక పంట, వేసవి కాలంలో ఫైనాపిల్, యాలుకులు ఎగుమతి చేస్తున్నారు. ఇదే విధంగా విజయవాడ నగరంలోని వివిధ డివిజన్లలోని ప్రజలను చైతన్యవంతులను చేయటం ద్వారా మెరుగైన ర్యాంక్ సాధించేందుకు అవకాశం ఉంటుందని ఫ్లోర్‌లీడర్ సత్యనారాయణ అన్నారు.

మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి

సైనిక బోర్డు డైరెక్టర్ వెంకటరెడ్డి



సైనిక బోర్డు డైరెక్టర్ వెంకటరెడ్డిని సత్కరిస్తున్న సంఘ సభ్యులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సైనిక బోర్డు డైరెక్టర్ వెంకటరెడ్డి చెప్పారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఎన్టీఆర్ జిల్లా మాజీ సైనికుల అసోసియేషన్ (నెక్సా) ప్రథమ వార్షికోత్సవ సమ్మేళనం ఘనంగా జరిగింది. వెంకటరెడ్డి మాట్లాడుతూ మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి సంఘాలు ఐక్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర సైనిక వెల్ఫేర్ భవనం నిర్మాణానికి స్థల సమస్యకు త్వరలో పరిష్కారం లభిస్తుందన్నారు. సైనిక బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ రాజారావు మాట్లాడుతూ పెన్షన్ పొందుతున్న మాజీ సైనికులు వారి భార్యల పేర్లను నమోదు చేయాలని కోరారు. సంఘ సభ్యులు వెంకటరెడ్డిని సత్కరించారు. ఎన్టీఆర్ జిల్లా మాజీ సైనికుల అసోసియేషన్ అధ్యక్షుడు గరిమెళ్ల శివనాగేశ్వరరావు, పి.రాంబాబు, ఎస్.ఎస్.రావు, బాలాజీ, ఉమామహేశ్వరరావు, గుప్తా పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



సదస్సులో మాట్లాడుతున్న బ్రహ్మాజీరావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పర్యావరణ శాఖ అధిపతి బ్రహ్మాజీరావు అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో జనవిజ్ఞాన వేదిక, ఆవారా, విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం పర్యావరణ పరిరక్షణపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బ్రహ్మాజీరావు మాట్లాడుతూ 1972లో ప్రారంభించిన పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం నేటికి 50 ఏళ్లు పూర్తి చేసుకుందన్నారు. ప్రపంచంలో అన్ని దేశాలు పర్యావరణంపై ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు.

ప్లాస్టిక్ రహిత సంవత్సరం

ప్రతి సంవత్సరం ఒక థీమ్‌ను పర్యావరణ పరిరక్షణ కోసం ప్రారంభిస్తారని, ఈ సంవత్సరం ప్లాస్టిక్ రహిత సంవత్సరంగా ముందుకు తెచ్చారన్నారు. ప్లాస్టిక్ డీ కంపోజ్ కావడానికి 400 సంవత్సరాలు పైనే పడుతుందని, దీనిని నిర్మూలించకపోతే జీవ వైవిధ్యానికి ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ప్రజలందరూ ప్లాస్టిక్ వాడకాన్ని వ్యతిరేకించాలని చెప్పారు మనమే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలి తద్వారా భూమి, పర్యావరణాన్ని కాపాడుకుంటామన్నారు. ఎఫ్‌ట్రానిక్స్ అధినేత రామకృష్ణ మాట్లాడుతూ 20 ఏళ్ల నుంచి గ్లోబల్ వార్మింగ్‌పై పెద్ద పోరాటం జరుగుతుందన్నారు. మనతోపాటు చిన్న సంచిని తీసుకెళ్లగలిగితే ప్లాస్టిక్‌ను ఎవరికి వారు నియంత్రించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఆవారా వ్యవస్థాపకుడు అజయ్ కాట్రగడ్డ, ఇన్నర్ వీల్ క్లబ్ బాధ్యుడు కవిత, జన విజ్ఞాన వేదిక నాయకుడు శ్రీనివాస్, ఎం.బి.విజ్ఞాన కేంద్రం బాధ్యులు యూ.వి.రామరాజు, ఐజాక్ న్యూటన్ పాల్గొన్నారు.

బహుముఖ ప్రతిభాశాలి ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం



సినీ గీతాలు ఆలపిస్తున్న డాక్టర్ లక్ష్మీశ, కోదండరామయ్య, శివలీల తదితరులు

విజయవాడకల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి సినీ నేపథ్య గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ డాక్టర్ లక్ష్మీశ ఐఏఎస్ అన్నారు. శృతిలయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై ఆదివారం సీనియర్ గాయకుడు బాలసుబ్రహ్మణ్యం 77 జయంతి వేడుకలు, సినీ సంగీత విభావరిని నిర్వహించారు. లక్ష్మీశ మాట్లాడుతూ.. బాల సుబ్రహ్మణ్యం తెలుగుతో పాటు ఇతర భాషల్లో 50 వేలకు పైగా పాటలు పాడారన్నారు. విశ్రాంత వాణిజ్యపన్నుల శాఖ అధికారి ఆకురాతి కోదండ రామయ్య మాట్లాడుతూ.. సినీ నిర్మాతగా సంగీత దర్శకుడు బాలు తెలుగు సినిమా చరిత్రలో విజయయాత్ర చేశారన్నారు. లక్ష్మీశ ఇతర గాయనీ గాయకులతో కలిసి పలు చిత్ర గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, కేవీ బ్రహ్మానందరావు, మోదుమూడి సుధాకర్, పోపూరి గౌరీనాథ్ సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు. గాయకుడు కోదండరామయ్య, శివలీల బాలు ఆలపించిన గీతాలను ఆలపించారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో కళావేదికపై పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషం ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై విజయవాడకు చెందిన హనుమాన్ నృత్య కళా నిలయానికి చెందిన పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం నృత్య ప్రదర్శన జరగగా, భక్తులు ఆసక్తిగా వీక్షించారు. నృత్య ప్రదర్శన ఇచ్చిన చిన్నారులకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లో వేం చేసి ఉన్న శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ఆరంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఉదయం స్వామి వారి ఆలయం నుంచి పలువురు భక్తులు ఊరేగింపుగా దుర్గాఘాట్‌కు చేరుకున్నారు. దుర్గాఘాట్ నుంచి పవిత్ర కృష్ణాజలాలను కలశాలతో తీసుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఊరేగింపులో ఆలయ కమిటీ అధ్యక్షుడు లింగిపల్లి అప్పారావు, బెవర సూర్యనారాయణ, మరుపిళ్ల హనుమంతరావు, పిళ్లా శ్రీనివాసరావుతో పాటు పలువురు కమిటీ సభ్యులు భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు.

విశేష పూజలు

దేవస్థాన ప్రాంగణంలోని కళ్యాణ మండపంలో శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు వినుకొండ రామరత్నమాచార్యులు మంగళస్నానాలు జరిపించారు. తొలుత పంచామృత అభిషేకాలు, మంగళస్నానాలు అనంతరం స్వామి వారిని పెండ్లికుమారుడిగా అలంకరించారు. సాయంత్రం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. తొలి రోజున ఉత్సవాలలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనగా, వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దేవస్థాన కమిటీ ఏర్పాట్లు చేసింది. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు మరుపిళ్ల సత్యనారాయణ, బెవర శ్రీనివాసరావు, పొట్నూరి దుర్గాప్రసాద్, ఈది ఎల్లారావు, తమ్మిన సూర్యకుమారి, కామందుల నరసింహరావు పాల్గొన్నారు.

సేవా పరమో ధర్మ నినాదం లక్ష్య సాధనకు కృషి



వెంకటేష్ దంపతులను సత్కరిస్తున్న సంస్థ సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): అనాథలు, ఆపన్నులు, అన్నార్తులను ఆదుకుంటూ సేవా పరమో ధర్మ నినాదం లక్ష్య సాధనకు కృషి చేస్తామని అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు బి.తిరుపతి రాజు పేర్కొన్నారు. భవానీపురంలోని హరిత బరంపార్క్‌లో గల కాన్ఫరెన్స్ హాల్‌లో సంస్థ 5వ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా 2023–24 ఏడాదికి డిస్ట్రిక్ట్ 225 (సౌత్) నూతన క్యాబినెట్ సభ్యులతో డాక్టర్ డీబీజీ శాస్త్రి (ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్) ప్రమాణ స్వీకారం చేయించారు. డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా జి.వెంకటేష్, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్లుగా ఎం.చిన్నారావు, బి.శ్రీనివాస్ యాదవ్, క్యాబినెట్ సెక్రటరీలుగా ఎస్.రైల్వే శ్రీనివాస్ (అడ్మిన్), బీఎస్ఎస్‌టీ సాయి(యాక్టివిటీ), ట్రెజరర్లుగా కె.ప్రసాద రాజు(రూరల్), టి.ప్రసాద్ గుప్తా(అర్బన్), డిస్ట్రిక్ట్ పీఆర్వోగా పి.శ్రీనివాసరావు నియమితులయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తిరుపతి రాజు మాట్లాడుతూ.. సంస్థ ద్వారా వివిధ రూపాల్లో అందిస్తున్న సేవలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే కాకుండా అంతర్జాతీయంగా విస్తరించామన్నారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ డైరెక్టర్ కె.రాజేశ్వరరావు, అడ్వైజర్ కె.రాజేంద్రప్రసాద్, సౌత్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ పి.వెంకట్రావు, మాజీ గవర్నర్ కందుల శారదావాణి తదితరులు పాల్గొన్నారు. ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్లుగా రాధిక, రాధ, లలితా రాణి వ్యవహరించారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ నూతన గవర్నర్ వెంకటేష్ దంపతులను సత్కరించారు.

క్షత్రియ సేవా సంఘం సేవలను సద్వినియోగం చేసుకోవాలి



వృద్ధులకు పింఛన్లు అందజేస్తున్న నిర్వాహకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): క్షత్రియ సేవాసంఘం సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ పెనుమత్స శ్రీనాగప్రవల్లిక, డాక్టర్ నాని అన్నారు. స్థానిక అయోధ్యనగర్ ఏవీ సుబ్బరాజు క్షత్రియ భవనంలో ఆదివారం ఆ సంఘంలోని వృద్ధులు, వితంతువులకు ఉచిత వైద్యశిబిరం, పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవిలో వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెల్లటి కాటన్ వస్త్రాలు ధరించడంతో పాటు ఏ అనారోగ్య సమస్యలు వచ్చినా నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ఆరోగ్యకేంద్రంలో సంప్రదించాలని చెప్పారు. క్షత్రియ సేవాసంఘం కె.ప్రసాద రాజు, కోశాధికారి వెంకటేశ్వరరాజు మాట్లాడుతూ.. సంఘం సభ్యులు, దాతల సహకారంతో వృద్ధులు, వితంతువులకు పింఛన్‌లు అందజేస్తున్నామన్నారు. అలాగే వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేస్తున్నామన్నారు. అనంతరం 200 మందికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అలాగే కలిదిండి రామచంద్రరాజు సహకారంతో 110 మందికి పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ఎల్.నారాయణ రాజు, ఎస్.అచ్యుత కుమార్ వర్మ, పి.అయోధ్య రామరాజు, కె.సాంబశివరామరాజు, క్షత్రియ యువజన సంఘం అధ్యక్షుడు వి.రామరాజు, కార్యదర్శి డి.రాజేష్ వర్మ, పిఎస్ఎన్ రాజు, సీతారామరాజు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అర్హత గల జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్లు మంజూరు చేయాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అర్హత కలిగిన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్లు మంజూరు చేయాలని సామ్నా, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. గాంధీనగర్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ హాలులో రాష్ట్ర చిన్న, మధ్య తరహా పత్రికల సంఘం(సామ్నా) రాష్ట్ర కార్యవర్గ సమావేశం, ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ సమావేశం వేర్వేరుగా ఆదివారం జరిగాయి. ఈ సమావేశాల్లో పలు తీర్మానాలు చేశారు. చిన్నపత్రికలకు జిల్లా కేంద్రాల్లో 1ప్లస్ 1, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు 2 ప్లస్ 2 అక్రెడిటేషన్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని, ఐటీ రిటర్న్స్ నిబంధనను ఎత్తివేయాలని కోరుతూ తీర్మానించారు. ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఐజేయూ నాయకుడు అంబటి ఆంజనేయులు మాట్లాడుతూ.. చిన్న పత్రికలు నడిపి ప్రస్తుతం పీడీఎఫ్ పత్రికలు నడుపుతున్న వారికి సీనియారిటీ ఆధారంగా అక్రెడిటేషన్లు మంజూరు చేయాలని కోరారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్ మాట్లాడుతూ.. ఏపీయూడబ్ల్యూజే పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం జీఎస్టీ నిబంధనను తొలగించిందన్నారు. సామ్నా రాష్ట్ర అధ్యక్షుడు నల్లి ధర్మారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ రమణారెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు యేచూరి శివ, కార్యవర్గ సభ్యులు కొర్లపాటి ప్రదీప్ కుమార్, బాబు, రమేష్, కూర్మరావు పాల్గొన్నారు.

బాబా మందిరానికి వెండి విరాళం



దాతను సత్కరిస్తున్న డాక్టర్ పూనూరు గౌతమ్‌రెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో వెండి తాపడం పనులకు ఆదివారం దాత కడియాల దీక్షిత తల్లిదండ్రులు సురేష్ దంపతులు కిలో వెండిని మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతమ్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆంధ్రా షిర్డీగా విరాజిల్లుతున్న బాబా మందిరంలో తాము తలపెట్టిన వెండితాపడం పనుల్లో భక్తులను భాగస్వాములను చేసేందుకు వెండిని స్వీకరిస్తున్నామన్నారు. కొత్త వెండితో పాటు ఇంట్లో వాడని పాత వెండిని సైతం తాము వెండి తాపడం పనులకు తీసుకుంటున్నామన్నారు. భక్తులు, దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని కొనియాడారు. దాత కడియాల దీక్షిత తండ్రి సురేష్ దంపతులు మాట్లాడుతూ మందిరంలో జరుగుతున్న వెండి తాపడం పనుల్లో తాము కూడా భాగస్వామి కావటం ఆనందంగా ఉందన్నారు. విదేశాల్లో ఉన్న తమ కుమార్తె దీక్షిత వెండిని అందజేశారన్నారు. అనంతరం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి బాబావారి శేషవస్త్రం చిత్రపటంతో దాతలను సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి, పి.మల్లయ్య పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి



ఆటోనగర్(విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్ బస్టాప్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం రాత్రి పటమట పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు నెరసిన జుట్టు, తెల్లగడ్డం ఉండి గీతల షర్ట్ ధరించి ఉన్నాడన్నారు. వడదెబ్బకు మరణించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు పటమట పోలీసులను సంప్రదించాలని సీఐ కాశీవిశ్వనాథ్ కోరారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల కోలాహలం



తాగునీరు అందిస్తున్న పోలీస్ అధికారి



అమ్మవారిని దర్శించుకుని బయటకు వస్తున్న భక్తులు





క్యూలో వేచి ఉన్న భక్తజనం



దుర్గ ఘాట్‌లో..

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో తెల్లవారు జాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో అమ్మ సన్నిధిలో భక్తుల కోలాహలం నెలకొంది. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీ భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ.